సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం, 14, ఫిబ్రవరి, 2025



ఆకలి కేకలు

రిమ్స్ హాస్టల్‌లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. భోజన కష్టాలు తప్పడం లేదు. - 8లో



కాసుల పండగ

టీడీపీ పల్లె పండగను కాసుల పండగగా మార్చుకుంది. ఇష్టానుసారం నిర్మాణాలు చేస్తున్నారు. - 8లో

డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూ పరిధిలోని డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి డీన్ జి.పద్మారావు గురువారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏంల్లో 7258 మంది హాజరు కాగా 40.62 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. డిగ్రీ సప్లిమెంటరీ విద్యార్థులు 4652 మంది హాజరు కాగా, 62.22 శాతం ఉతీర్ణత నమోదైనట్లు చెప్పారు. 15 రోజుల్లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

న్యూస్‌రీల్

వల్లభనేని వంశీ అక్రమ అరెస్ట్ సరికాదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వల్లభనేని వంశీని అరెస్ట్ చేయడం దారుణమని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేస్తోందని వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వంశీ అరెస్టుపై గురువారం ఓ ప్రకటన విడు దల చేశారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడాల్సింది పోయి ప్రతీకార చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో పాలన సాగించడంపై రాష్ట్ర ప్రజలంతా ఛీత్కరించుకుంటున్నారని తెలిపారు. ఇచ్చిన హామీ లన్నీ గాలికొదిలేసి ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. విచారణకు పిలిపించకుండా ఉగ్రవాదిపై దాడి చేసినట్లు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. రాష్ట్రంలో మహిళల మీద జరుగుతున్న దాడుల్ని గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్ట్ చేయడం సరి కాదని, సూపర్ సిక్స్ ని గాలికొదిలేసి కిరాతకంగా పాలన సాగిస్తున్న విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. వంశీ అక్రమ అరెస్టుని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇదే తరహాలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



శ్రీముఖలింగం ఆలయ ధ్వజస్తంభం వద్ద పందిరి రాట పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో ఈనెల 26 నుంచి 28 వరకూ వరకూ జరగనున్న శ్రీముఖలింగేశ్వరుని శివరాత్రి ఉత్సవాలకు శుభ ముహూర్తం ఖరారైంది. ఉత్సవాలు మూడు రోజుల పాటు సజావుగా సాగేందుకు గురువారం ఉదయం పందిరిరాట వేశారు. ఇక ఆలయ ఉత్సవ పనులు ప్రారంభించనున్నారు. దీనికి ముందు ముత్తైదువులు పాలకొమ్మ, మామిడి తోరణాలు వెదురు కర్రతో కలిపి ముత్యాలు, గోధుమ రాయి పాలుతో కలిపి భూమి పూజ చేశారు. ఈఓ పి.ప్రభాకరరావు, సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు కె.హరి ప్రసాద్, పురోహితులు బంకుపల్లి మధుశర్మ, ఆలయ అర్చకులు శేషాద్రి వేంకటాచలం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగ బాలలను గుర్తించాలి



జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: వికలాంగ బాలబాలికలకు వైద్య సేవలు, ఉచిత పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా న్యాయస్థానంలో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా దివ్యాంగులను గుర్తించాలని, వారికి తగిన న్యాయ సహాయం, ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రధానంగా చికిత్సకు అవసరమైన వారిని గుర్తించి కార్యక్రమం వేగవంతం చేయాలని తెలిపారు.


సిక్కోలుకు ప్రేమలేఖ

‘ఏ స్టోరీ ఆన్ స్టోన్’ పవిత్రమైన సిక్కోలు గడ్డపై అనంతమైన అభిమానంతో రాసిన ప్రేమలేఖ. అటు ఇచ్ఛాపురంలోని సురంగి వారి కోట నుంచి ఇటు శ్రీకూర్మంలోని కుడ్య చిత్రాల వరకు ఏ కథను వదలకుండా ‘ఇంటాక్’ సభ్యులు అందంగా గుదిగుచ్చిన బంతిపూల మాల. ప్రతి ప్రాంతాన్ని, ప్రతి చరిత్రను, ప్రతి గాథను మనసారా ప్రేమించి ఆరారా అచ్చువేసిన ఓ పుస్తకమిది. పుస్తకమే కాదు ఆ ప్రయత్నం వెనుక ఉన్నది స్వచ్ఛమైన ప్రేమ. ఈ మట్టిపై, ఇక్కడి కథలపై, ఈ దారుల్లో దాగున్న అపురూప చరిత్రపై అమితమైన ఇష్టం. అంతే ఇష్టం మీకూ ఉంటే.. గ్రంథాలయంలోని ఈ పుస్తకాన్ని తిరగేయండి. పేజీలు ప్రియురాలిలా మారి చెప్పే ఊసులు వినండి. నెచ్చెలిలా చిత్రాలు వివరించే నులివెచ్చని జ్ఞాపకాలను ఆస్వాదించండి.

– శ్రీకాకుళం కల్చరల్

- సిక్కోలు మట్టిపై ఇంటాక్ అమితమైన ప్రేమ
- చారిత్రక ప్రదేశాల సమాహారంగా పుస్తక రూపకల్పన
- టూరిజం స్థలాలతో బ్రోచర్ ఆవిష్కరణ





ఏ స్టోరీ ఆన్ స్టోన్ పుస్తకం

ఒక ప్రాంత చరిత్ర గుర్తుండాలంటే.. అక్కడి కథలు మళ్లీ మళ్లీ చెప్పుకోవాలి. ఆ ప్రాంత ప్రాశస్త్యం తెలియాలంటే.. ఆ గాథలు చరిత్రలో మిగిలిపోయే ప్రయత్నమేదో చేయాలి. అలాంటి ప్రయత్నమే ఇంటాక్ చేసింది. శ్రీకాకుళం జిల్లా చరిత్రను అందమైన పుస్తకంగా అచ్చు వేసి అందుబాటులో ఉంచింది. దేశంలోని అన్ని యూనివర్సిటీలకు, కళాశాలలకు, గ్రంథాలయాలకు చేరే విధంగా చర్యలు తీసుకుంది. భారత జాతీయ సంస్కృతి కళ వారసత్వ సంపద పరిరక్షణ సంస్థ కేంద్ర సహకారంతో నడుస్తోంది. ఇక్కడి శాఖ జిల్లాపై ఉన్న ప్రేమతో సంస్కృతి, వారసత్వ సంపదను అందరికీ తెలియజేసేందుకు విశేష కృషి చేసింది. దూసి ధర్మారావు జిల్లా శాఖ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడి ఇండియన్ బ్యాంకులో ఉద్యోగం చెస్తున్న మండా శ్రీనివాసరావు ఫొటోగ్రఫీ నైపుణ్యాన్ని ఉపయోగించుకుని ‘శ్రీకాకుళం ఏ స్టోరీ ఆన్ స్టోన్’ అనే పుస్తకం రూపొందించారు. అందులో జిల్లాలోని చారిత్రక స్థలాలు, కళలు, సంస్కృతి వారసత్వ సంపదలు, కవులు, గాయకులు, నటులు, పర్యాటక ప్రదేశాల గురించి నిక్షిప్తం చేశారు. అనంతరం కేవీజే రాధాప్రసాద్ కన్వీనర్‌గా ఉన్న సమయంలో విద్యార్థులకు మన సంస్కృతి వారసత్వాలను పరిచయం చేసే ప్రక్రియలో వారికి వ్యాసరచన పోటీలు, వారికి అక్కడి సందర్శింప చేసే కార్యక్రమం చేశారు.



220 సమర్పణ పత్రాలు

చారిత్రక ప్రదేశాలతో ఇంటాక్ సమర్పణ పత్రాలు అందించాను. జిల్లాలో చారిత్రక నిర్మాణాల సంపద, తీరప్రాంత చారిత్రక సంపదతో కలిపి మొత్తం 220 ప్రదేశాలు ఉన్నట్లు గుర్తించాను. వీటిని అన్నింటిని రికార్డు చేసి ఈ పత్రాలను క్రమపద్ధతిలో ఇంటాక్ సంస్థకు రికార్డులు పంపించాం. – మండా శ్రీనివాస్, ఇంటాక్ ఫొటోగ్రాఫర్

చరిత్ర తెలియాలని..



జిల్లా చరిత్ర విద్యార్థులకు తెలియాలని నేను కన్వీనర్‌గా ఉన్న సమయంలో పోటీలు నిర్వహించేవాళ్లం. ధర్మారావు కాలంలో రూపొందించిన పుస్తకాన్ని కలెక్టర్ల సాయంతో పునర్ముద్రణ చేసి యూనివర్సిటీలకు, గ్రంథాలయాలకు ఉచితంగా అందించాం.
– కేవీజే రాధా ప్రసాద్, పూర్వపు కన్వీనర్, ఇంటాక్

సేకరణ, నిక్షిప్తీకరణ, నివేదన

స్థానికంగా ఉండే చారిత్రక ప్రాధాన్యత కలిగిన అంశాలను ఎంచుకొని ఆ ప్రాంతానికి స్వయంగా వెళ్లి అక్కడి ప్రజల ద్వారా తెలుసుకున్న అంశాలతో పాటు చారిత్రక అంశాలను అధ్యయనం చేసి వాటిని రికార్డు చేసి రిపోర్టును కేంద్ర శాఖకు పంపుతారు. వారి సొంత ఖర్చులతో వెళ్లి విషయ సేకరణ చేస్తారు. ఇప్పటి వరకు 150 టూరిజం స్థలాలను, 100కు పైగా చారిత్రక స్థలాలను గుర్తించి పుస్తకంలో నిక్షిప్తం చేశారు. పురాతన తాళపత్ర గ్రంథాలను కూడా సేకరించారు. అలాగే హెరిటేజ్ ఫొటోగ్రఫీ ప్రదర్శనలో ప్రదర్శించగా ఎన్నో ప్రశంసలు వచ్చాయి. కోల్‌కతాలో కూడా ప్రదర్శించారు.

ఇంటాక్ ద్వారా మూడు పుస్తకాలు



ఇంటాక్ తరపున గుర్తించిన చారిత్రక ప్రదేశాలన్నింటితో ఒక పుస్తకాన్ని రూపొందించారు. ‘ శ్రీకాకుళం... ఏ స్టోరీ ఆన్ స్టోన్ ’ పేరుతో పుస్తకాన్ని ఇప్పటికి మూడు సార్లు ముద్రించాం. కళింగ ఆంధ్ర చరిత్ర, స్టోరీ ఆన్ స్టోన్స్ శ్రీకాకుళం, జిల్లా చరిత్రపై బిట్స్‌తో ఒక పుస్తకాన్ని కూడా రూపొందించాం.
– వి.జగన్నాథం నాయుడు, అదనపు కన్వీనర్, ఇంటాక్ శాఖ

దూసి కోసం ప్రయత్నం



మహాత్మా గాంధీ అడుపెట్టిన దూసి రైల్వే స్టేషన్‌ను గాంధీ స్మారక స్థలిగా గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాం. యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమం కొనసాగుతోంది.
– నూక సన్యాసిరావు, కన్వీనర్, ఇంటాక్ శ్రీకాకుళం శాఖ



విద్యార్థులకు పోటీలు

విద్యార్థులకు మన సంస్కృతి సంప్రదాయాలు, చారిత్రక కట్టడాల వంటి వాటిపై జిల్లా స్థాయి, జోనల్ స్థాయిల్లో పోటీలు నిర్వహించి వారిలో చిన్నతనం నుంచి అవగాహన కల్పిస్తున్నాం.
– నటుకుల మోహన్, ఇంటాక్ కో కన్వీనర్

శ్రీకాకుళం నా ప్రేమనగర్



శ్రీకాకుళం కేవలం ఒక ఊరి పేరో, ఒక జిల్లా పేరో మాత్రమే కాదు. అభ్యుదయ సామాజికవాదుల ఊపిరి ఉత్తేజం నింపే ఆక్సిజన్. జీవనదుల నేల, ఖనిజాల గని, శ్రమజీవుల తూర్పు ప్రాంతం. జిల్లా పేరు చెబితే ఇండియన్ హెర్క్యులస్ కోడి రామ్మూర్తి నాయుడు, వయోలిన్ విద్వాంసుడు వెంకటస్వామి నాయుడు, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు, ఆధునిక సాహిత్యానికి, కథ, నాటకం, ముత్యాల సరాలు అందించిన గురజాడ.. పెన్ను గన్ను పట్టిన పాణిగ్రాహి గుర్తుకు వస్తారు. ప్రసిద్ధ ప్రజా కళాకారుడు వంగపండు వంటి వారికి .. ఇక్కడి సీమ కొండలు, సాలూరవతలి సువర్ల కొండలే కాక కత్తు లు దులపరించిన చిలకలు, పాముని యెంటదగిలి న చీమలు గుర్తొస్తాయి. శ్రీకాకుళం రా వీర శ్రీకాకుళం రా – వీర యోధులనే కన్న గడ్డ శ్రీకాకుళం రా... అందుకే శ్రీకాకుళం నా ప్రేమనగర్.
– అట్టాడ అప్పలనాయుడు, ప్రముఖ కథ, నవల రచయిత





క్లారి ప్యూరి మెచ్యూరి టీ

ఈ మూడు సూత్రాలతోనే ప్రేమ గెలుపు

ప్రేమ అంటే ఆకర్షణేనా..? సంఘర్షణ ప్రేమలో భాగమా..? స్వచ్ఛమైన ప్రేమబంధం పెళ్లి వరకు వెళ్లగలదా..? ఇలాంటి ప్రశ్నలకు కొందరు ‘గురువులు’ కొన్ని సమాధానాలిచ్చారు. క్లారిటీ, ప్యూరిటీ, మెచ్యూరిటీ ఉన్నప్పుడే ప్రేమ గెలుస్తుందని చెబుతున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, పాతతరంలోని జంటలను ఆదర్శంగా తీసుకోవాలని చెబుతున్నారు. – టెక్కలి



మార్కెట్‌లో లభ్యమవుతున్న గిఫ్ట్‌లు

పెద్దలను ఒప్పించాలి



ప్రేమను జయించే క్రమంలో రెండు కుటుంబాల పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేయాలి. ముందుగా ఇద్దరు స్థిరపడేందుకు చేసుకున్న ప్రణాళికను కుటుంబ సభ్యులకు వివరించాలి. పెద్దవాళ్లు అడ్డు చెబితే ఎందుకు చెబుతున్నారో అర్థం చేసుకోవాలి. నేటి తరం కెరీర్‌పై దృష్టి సారిస్తే ప్రేమను సునాయాసంగా జయించవచ్చు.
–ఎస్.రాజశేఖర్, డాక్టర్, టెక్కలి.

కెరీర్ ముఖ్యం..



ప్రేమను జయించాలంటే ముందు ఇద్దరూ కెరీర్ పై దృష్టి సారించాలి. నేటి తరం ప్రేమలో కొంత సోషల్ మీడియా ప్రభావం ఉంది. పాత తరం ప్రేమల్లో భక్తి, భయం, బాధ్యత, జీవితంలో స్థిరపడిన తరువాత వివాహం అనే దానిపై అవగాహన ఉండేది. జీవితం, సమాజం, ఆర్థిక పరిస్థితులు, ప్రధానంగా కుటుంబ బాధ్యతలపై అవగాహన లేని ప్రేమలు శాశ్వతంగా ఉండవు.
– డాక్టర్ కె.వెంకట లలితా భవాని, ప్రొఫెసర్, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, టెక్కలి.

కుటుంబం మద్దతు ఉండాల్సిందే..



ప్రేమ ఫలించాలంటే కచ్చితంగా రెండు కుటుంబాల మద్దతు ఉండాలి. అలా కాకుండా ఊహా లోకపు ప్రేమలు శాశ్వతంగా ఉండవు. కుటుంబాలను వదులుకుని చేసుకునే ప్రేమ వివాహాలు ఇద్దరి మధ్య విభేదాలను సృష్టిస్తాయి. ఇద్దరి మధ్య ప్రేమ ఫలించలేదంటే అది కేవలం ఆకర్షణ మాత్రమే. సినిమాల ప్రభావం, ఇతర ప్రభావంతో కొనసాగించే ప్రేమలు శాశ్వతం కావు.
– రోణంకి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, టెక్కలి

ఏ తల్లికీ రాకూడని శోకం



ఏ తల్లికీ రాకూడని శోకమిది. ఏ తండ్రీ పడకూడని బాధ ఇది. ఏ కుటుంబానికీ కలగకూడదని శాపమిది. చేగొడియం గొంతులో ఇరుక్కుని ఏడాదిన్నర చిన్నారి మృతి చెందడంతో రణస్థలం మండలం లంకపేట గ్రామం శోక సంద్రమైంది. ఏడాదిన్నర వయసు గల సోనాక్షిత గురువారం ఉదయం వరకు ఇంటిలో చలాకీగా తిరుగుతూ అల్లరి చేసింది. వచ్చీరాని ముద్దుముద్దు మాటలతో సందడి చేసింది. మారాం చేస్తోందని అమ్మ చేగొడియం ఇవ్వగా.. అది దురదృష్టవశాత్తు చిన్నారి గొంతులో ఇరుక్కుపోయి ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయింది. రెండు ఆస్పత్రులు తిప్పినా ఫలితం లేకపోయింది. చిన్నారి చనిపోయిందని తెలిసి ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. విగతజీవిగా ఉన్న బుజ్జాయిని చూడలేక విలవిలలాడిపోయారు. ఈ సంఘటన దురదృష్టవశాత్తు జరిగినా.. ఇంటిలో పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలని, ఇంకా దంతాలు పూర్తిగా రాని వయసులో గట్టిగా ఉండే పదార్థాలు తినడానికి ఇవ్వకూడదని వైద్యులు సూచిస్తున్నారు.
- రణస్థలం

బుజ్జితల్లీ.. వచ్చేశా కదే..

శ్రీకాకుళంలో తండేల్ యూనిట్ సందడి చేసింది. నగరంలో కోడి రామ్మూర్తి స్టేడియంలో తండేల్ సినిమా సక్సెస్ మీట్ గురువారం జరిగింది. సినిమా హీరో నాగచైతన్య మాట్లాడుతూ.. సిక్కోలు యాస తనకు ఇష్టమైనది, కష్టమైనది కూడా అని చెప్పారు. చందూ మొండేటి ఈ కథ కోసం వివరించారని, తండేల్ రాజు పాత్ర కోసం ఇక్కడి మత్స్యకార గ్రామానికి వెళ్లి యాస, పద్ధతులు నేర్చుకున్నానని తెలిపారు. సినిమాలోని కొన్ని డైలాగులను శ్రీకాకుళం యాసలో చెప్పడంతో ప్రేక్షకులు ఆనందంతో చప్పట్లు కొట్టారు. హీరోయిన్ సాయిపల్లవి మాట్లాడుతూ మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాత అల్లు అర వింద్ మాట్లాడుతూ శ్రీకాకుళం అంటే గుర్తుకొచ్చేది కోడి రామ్మూర్తి నాయుడని చెబుతూ ఆయన బయోపిక్ తీస్తానన్నారు. కార్యక్రమంలో నిర్మాత బన్నీ వాసు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం యువత మత్తుమందులకు బానిస కాకూడదనే సందేశాన్ని ఇచ్చే పోస్టర్‌ను హీరో, హీరోయిన్, సినిమా యూనిట్ చేత డీఎస్పీ వివేకానంద విడుదల చేయించారు. – శ్రీకాకుళం కల్చరల్



ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్న సాయిపల్లవి





చిందేసిన నాగచైతన్య

క్లుప్తంగా

25 మంది క్షేత్ర సహాయకులకు మెమోలు

గార : ఉపాధి పనుల కల్పనలో వేగం పెంచనందుకు గార మండలంలో 25 మంది క్షేత్ర సహాయకులు (ఫీల్డు అసిస్టెంట్లు)కు గురువారం మెమోలు జారీ అయ్యాయి. బుధవారం జరిగిన మండల వారాంతపు సమీక్షలో డ్వామా పీడీ బి.సుధాకరరావు హాజరై తక్కువ పని కల్పించిన వారందరికీ మెమోలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి నెలాఖరు వరకు రోజువారీ సరాసరిగా 5775 మంది వేతనదారులకు పనికల్పించాల్సి ఉంది. వాడాడ, శ్రీకూర్మం పంచాయతీలు మినహా వెనుకబడిన అన్ని పంచాయతీల ఎఫ్ఏలకు మెమోలు జారీ చేశారు. రబీలో అపరాలు పంట చేతికొచ్చే సమయం, కొన్ని చోట్ల వరి ఉభాలు, మిరప, చెరకు వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులకు కూలీల సమస్య వెంటాడుతోంది. ఇంకోపక్క ఉపాధి పనులకు రమ్మని పిలుస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల దొరకడం లేదని ఆందోళన చెందుతున్నారు.

చెత్త తొలగించారు



చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

గార: శాలిహుండం కొండపైకి భక్తులు వెళ్లే తొలి మెట్లు వద్ద చెత్త, చెప్పులు, వ్యర్థాలను ఎట్టకేలకు పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. 'యాత్ర ముగిసింది.. యాతన మిగిలింది' అనే శీర్షికన 'సాక్షి' పత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి శాలిహుండం సచివాలయ కార్యదర్శి పల్లంటి సురేష్ స్పందించారు. ఉదయమే పారిశుద్ధ్య కార్మికులను తీసుకెళ్లి రెండు మెట్లు వద్ద ఉన్న చెత్తను తొలగించి చెత్త సంపద కేంద్రానికి తరలించారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

మెళియాపుట్టి: రోగులకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ అన్నారు. గురువారం మెళియాపుట్టి పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలు, ఓపీ, డెలివరీ వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరిశుభ్రత పాటించాలని, తద్వారా రోగాలబారిన పడకుండా ఉంటారని చెప్పారు. భోజనానికి ముందు తర్వాత చేతులను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు గ్రీష్మ, కేజీబీవీ ఎస్‌వో రమ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన వాహనం వద్ద అధికారులు

కంచిలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బి.ప్రసాదరావుకు వచ్చిన ముందస్తు సమాచారంతో కంచిలి మండలం దాకరాపల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు గురువారం పట్టుకున్నారు. బొలెరో వాహనంలో 66 బస్తాలలో తరలిస్తున్న 3,560 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ రమేష్‌బాబును ప్రశ్నించగా కంచిలి గ్రామానికి చెందిన కొత్తకోట నాగరాజు ప్రజల వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసి బరంపురం రవాణా చేస్తున్నట్లు తెలియజేశాడు. దీంతో అధికారులు రూ.1,61,980 విలువైన పీడీఎస్ బియ్యాన్ని, బొలేరో వాహనాన్ని సీజ్ చేసి అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో కంచిలి సివిల్ సప్లయ్ డీటీ పి.కూర్మారావు, విజిలెన్స్ ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమయాల్లో మార్పు సరికాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల సముదాయాల (స్కూల్ కాంప్లెక్స్) సమయాల్లో మార్పు సరికాదని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం 11.45 గంటల వరకు పనిచేస్తున్న పాఠశాలల్లో తరగతులు నిర్వహించి, మధ్యాహ్నం భోజనం బాధ్యతలు చేపట్టి సుదూర ప్రాంతాల్లో ఉన్న క్లస్టర్ పాఠశాలలకు వెళ్లడం కష్టతరంగా ఉంటుందన్నారు. క్లస్టర్ సమావేశాలు ఉన్న రోజుల్లో పాఠశాలలకు పూర్తి స్థాయిలో సెలవులు ప్రకటించి, సమావేశాలు నిర్వహిస్తే బాగుంటుందన్నారు. ఆ రోజు మెడికల్ లీవ్ తప్ప మరో గత్యంతరం లేకుండా మిగతా సెలవులు విని యోగించరాదనే నిబంధనలు విధించడం ఎంతమాత్రం సరికాదని మండిపడ్డారు. పాత స్కూల్ కాంప్లెక్స్ నిబంధనలు ప్రకారం 50 శాతం ఉపాధ్యాయులు పాఠశాల సముదాయాలకు హాజరైతే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ కలగవని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా సబ్జెక్టు ఉపాధ్యాయులకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తే ఉపయోగకరంగా ఉంటుందని, మైనర్ మీడియం ఉపాధ్యాయులకు యథావిధిగా పాఠశాల సముదాయాలనుకొనసాగించాలని వారు కోరారు.

రిమ్స్ హాస్టల్లో.. ఆకలి కేకలు

- వైద్య విద్యార్థులకు, హౌస్‌సర్జన్లకు తప్పని భోజన కష్టాలు
- డబ్బులు చెల్లిస్తున్నా సరైన తిండి లేక అవస్థలు
- ఫిర్యాదు చేసే విద్యార్థులకు హెచ్చరికలు!



శ్రీకాకుళం రిమ్స్ హాస్టల్ డైనింగ్ రూమ్

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ కళాశాలలో ఎంబీబీఎస్ డిగ్రీ, పీజీ కోర్సులతో పాటు హౌస్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్న విద్యార్థులు సరైన భోజనం లేక అర్ధాకలితో అలమటిస్తున్నారు. భోజనాల బిల్లుగా నెలకు రూ.3వేల నుంచి రూ.3,500ల వరకు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నప్పటికీ నాణ్యత లేని భోజనాలు అందుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంబీబీఎస్ హాస్టల్‌లో 400 మంది వరకు, పీజీ, హౌస్ సర్జన్లు 250 మంది వరకు ఉన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు భోజనం అందించేందుకు రూ.3,500 చెల్లిస్తున్నా కాంట్రాక్టర్ తనకు ఇష్టం వచ్చిన వంటకాలను, అది కూడా నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టుకుని భోజనం చేయాల్సి వస్తోందని, సరైన తిండి లేక చదువుపై ఏకాగ్రత ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహారంలో నాణ్యతా లోపాన్ని ప్రిన్సిపాల్‌కు కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేశారని, దీంతో కాంట్రాక్టర్‌ను మార్చేందుకు ప్రిన్సిపాల్ మరికొందరు ప్రొఫెసర్లు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే యూజీ విద్యార్థులకు భోజనాలు అందించే కాంట్రాక్టర్ వార్డెన్‌కు బంధువు కావడంతో ఫిర్యాదు చేసిన విద్యార్థులకు ఇంటర్నల్ తగ్గించి ఫెయిల్ చేస్తామని హెచ్చరికలు వచ్చాయని, దీనివల్ల ఫిర్యాదు చేసిన వారే ఉపసంహరించుకుంటూ లేఖ సమర్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వారి పరిస్థితి దయనీయం...

పీజీ, హౌస్ సర్జన్ చేస్తున్న విద్యార్థులకు కూడా సరైన ఆహారం అందని పరిస్థితి నెలకొంది. రోగులకు ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టరే వీరికి కూడా భోజనం అందిస్తున్నారు. రోగులకు ఇస్తున్న ఆహారంతో పాటు అదనంగా ఓ కూర, సాంబారు తప్ప మెనూను అమలు చేయటం లేదు. వాస్తవానికి హాస్టల్‌లో మెనూ, పర్యవేక్షణకు విద్యార్థులతో ఓ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉండగా, అటువంటి దాఖలాలు లేవు. ఐతే వీరికి ప్రభుత్వ పరంగా స్టైఫండ్ వస్తుండటంతో ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టుకొని ఆహారాన్ని తెప్పించుకుంటున్నారు.

డ్యూటీ డాక్టర్లదీ అదే పరిస్థితి..

ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో పాటు పీజీలు, హౌస్ సర్జన్లకు యాజమాన్య పరంగా భోజనం సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇందుకు గానూ ప్రభుత్వం నిధులు కూడా ఇస్తోంది. వీరికి ఏ రోజు ఏమి సరఫరా చేయాలన్న దానిపై మెనూ కూడా ప్రభుత్వం నిర్దేశించింది. రిమ్స్‌లో ఇవేవీ అమలు కావడం లేదు. ఫలితంగా డ్యూటీ డాక్టర్లు ఇళ్లకు వెళ్లడమే, బయట నుంచి ఆహారం తెప్పించుకోవడమో జరుగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నాకు ఎవరూ చెప్పలేదు..



నాది ఈ ఊరే కాదు. ఆహారం బాగోలేదని నాతో ఎవ్వరూ చెప్పలేదు. దీనిపై ఏమైనా ఫిర్యాదులుంటే చీఫ్ వార్డెన్‌గా ఉన్న ప్రిన్సిపాల్‌నే అడగాలి.

– డాక్టర్ రాజీవ్, ఎంబీబీఎస్ హాస్టల్ వార్డెన్

ఆచార్యులతో చర్చిస్తా...



భోజనాలు సరిగ్గా అందడం లేదని గతంలో ఫిర్యాదు రావడం వాస్తవమే. దానిని విద్యార్థులే ఉపసంహరించుకున్నారు. ఈ విషయంలో హాస్టల్‌కు ఉండే ఆచార్యుల కమిటీతో మాట్లాడి సరైన భోజనం అందేలా చూస్తాం.

– డాక్టర్ రవి వెంకటాచలం, ప్రిన్సిపాల్

డ్యూటీ డాక్టర్లకు వేరేగా వంట..



రోగులకు ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టరే డ్యూటీ డాక్టర్లుకు ఆహారం ఇస్తున్నారు. అయితే వీరికి వేరేగా వండుతున్నారు. రోగులకంటే అదనంగా రూ.30 వరకు డ్యూటీ డాక్టర్ల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోంది.

– డాక్టర్ షకీలా, సూపరింటెండెంట్, సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళం

బెల్టు షాపులకు తరలిస్తున్న మద్యం పట్టివేత



రూరల్ పోలీసుల అదుపులో మద్యం సీసాలతో పాటు మద్యం తరలిస్తున్న వ్యక్తులు

ఇచ్ఛాపురం రూరల్: బ్రాందీ షాపు నుంచి బెల్టు షాపులకు రహస్యంగా మద్యం సీసాలను తరలిస్తున్న వాహనాన్ని ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. కవిటి గ్రామానికి చెందిన తండ్రీ, కొడుకులు గరడాల కాళిదాసు, గరడాల నానీలు బుధవారం రాత్రి పదకొండున్నర గంటల ప్రాంతంలో.. ఇచ్ఛాపురం మండలం కొఠారీ–ఈదుపురం గ్రామాల మధ్యలో గల కృష్ణా వైన్స్ షాపు నుంచి భారీగా మద్యం సీసాలను బాక్స్‌లతో బెల్టు షాపులకు ఇచ్చేందుకు వెళ్తుండగా తిప్పనపుట్టుగ జంక్షన్ వద్ద రూరల్ పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వాహనంలో సుమారు రెండు లక్షల రూపాయలు విలువైన 1632 మద్యం సీసాలు, 120 బీర్లు ఉన్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లను కవిటి మండలం కపాసుకుద్ది గ్రామానికి చెందిన బాబూరావు ఇంటి వద్దకు తరలిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులతో పాటు బాబూరావుపై కేసు నమోదు చేస్తామని, అదే విధంగా భారీ ఎత్తున బెల్టు షాపులకు మద్యంను అమ్మిన సంబంధిత వైన్ షాపు లైసెన్సును రద్దు చేస్తామని తెలిపారు. మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమయపాలన తప్పనిసరి



కొత్తూరు సీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

కొత్తూరు: కొత్తూరు సీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యాధికారులతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ యస్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. స్థానిక సీహెచ్‌సీని గురువారం పీఓ ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగితెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పుస్తకాలతో పాటు మందుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. రోగులకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు వివరాలు ఇవ్వాలని సూపరింటెండెంట్ ధర్మాన కిషోర్ తెలిపారు. విధి నిర్వహణలో సిబ్బంది ఆలసత్వం వహిస్తే సహించేది లేదని పీఓ అన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 120 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. జిల్లాలోని పలు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ డిప్లొమా విద్యార్థులు హాజరయ్యారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 120 మందిని ఎంపిక చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. దామోదర్‌రావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి బి.తులసీరావు, ఎన్‌ఫీల్డ్ టీం అధికారి విక్టర్ దేవ్ పర్యవేక్షించారు.

టీడీపీ నేతలకు కాసుల 'పండగ'

- ఇష్టారాజ్యంగా పల్లెపండగ పనులు
- పొలానికి ఒక చోట.. 'త్రిపుల్ ధమాకా' మరోచోట



టీడీపీ నేత కుత్తుమ శివప్రసాద్ వ్యవసాయ పొలానికి వేసిన సీసీ రోడ్డు

సంతబొమ్మాళి: ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండగ కార్యక్రమం టీడీపీ నేతలకు కాసుల పండగగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా వారికి ఇష్టమున్నచోట, అవసరం లేని చోట సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామంలో టీడీపీ నాయకులు వేసిన సీసీ రోడ్ల నిర్మాణాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నేత కుత్తమ శివప్రసాద్ ఏకంగా తమ వ్యవసాయ పొలానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజాధనం దుర్వినియోగం చేసిన సంఘటన వెలుగుచూసింది. గత ఏడాది ఆగస్టు 23న గ్రామసభ ఆమోదం తెలపగా అక్టోబర్ 6న పనులు మంజూరయ్యాయి. వర్క్ ఐడీ నెంబర్ 0201029013/ఆర్‌సీ/ 999900 5243010తో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఏకంగా తమ పొలానికి రోడ్డు వేసుకోవడమే కాకుండా లక్షల రూపాయిల బిల్లులు చెల్లింపులకు సిద్ధంగా ఉన్నాయి. తమ పొలంలో కొంత స్థలం ఆక్రమించి సీసీ రోడ్డు వేశారని గ్రామానికి చెందిన తామాడ విశ్వేశ్వరరావు పోలీస్ స్టేషన్‌ల ఫిర్యాదు చేయగా.. అధికారాన్ని ఉపయోగించి రాజీ చేశారు.

మంజూరు మేరకే..

కాపుగోదాయవలసలో మంజూరు మేరకే సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాం. రోడ్డు నిర్మాణం జరిగినప్పుడు చిన్నపాటి గొడవలైనా మళ్లీ వారు రాజీ అవడంతో పనులు చేపట్టారు.

– మాధవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, చిన్నతుంగాం గ్రామ సచివాలయం

ఈ చిత్రాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక రోడ్డుపై మరో రోడ్డు.. దానిపై ఇంకోసారి రోడ్డు వేసినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నిర్మాణం జరిగింది కూడా సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసలోనే. వర్క్ ఐడీ0201029013/ఆర్‌సీ/ 9999005243056తో అంగ శేఖర్ ఇల్లు నుంచి గోర్జి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.19లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం టీడీపీ నేతలకు ట్రిపుల్ ధమాకాగా మారింది. ఈ ప్రాంతంలో టీడీపీ నేతలు మూడు సార్లు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. 2002, 2014–15 సంవత్సరాలతో పాటు ప్రస్తుతం కూడా రోడ్డు మీద రోడ్డు వేసి మూడు సార్లు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణం జరిగిన అధికారులు పట్టించుకోకపోవడం, అధికార పార్టీ ఆగడాలపై ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా అక్రమంగా కేసులు బనాయించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



మూడు సార్లు వేసిన రోడ్డు నిర్మాణం ఇదే..

40కి బదులుగా 80 మార్కుల ప్రశ్నపత్రం

- ప్రత్యేక బీఎడ్ సెమిస్టర్ పరీక్షలో గందరగోళం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రత్యేక బీఎడ్ (మెంటల్లీ రిటార్డ్) మొదటి సెమిస్టర్ పరీక్షల్లో గురువారం గందరగోళ పరిస్థితి ఏర్పడింది. 40 మార్కులకు రావాల్సిన ఇంట్రడక్షన్ టు డిజేబులిటీ ప్రశ్నపత్రం 80 మార్కులకు రావడంతో విద్యార్థులు ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రశ్నపత్రం డిజైన్ లోపం వల్ల సమస్య తలెత్తిందని గుర్తించి అధికారులకు విషయం చెప్పారు. 40 మార్కులకు గంటన్నర రాయాల్సిన ప్రశ్నపత్రం 80 మార్కులకు మూడు గంటలకు రాయాల్సి రావటంతో విద్యార్థులు ఆందోళన చెందారు. దీంతో ప్రత్యేక బీఎడ్ బోధకులు జోక్యం చేసుకొని 40 మార్కులకు ప్రశ్నపత్రం కుదించారు. 29 మంది విద్యార్థులు కావటం వల్ల సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం చూపారు. అయితే వందల్లో విద్యార్థులు ఉంటే పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ విషయమై పీజీ ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ వద్ద ప్రస్తావించగా విషయం తన దృష్టికి రాలేదని, పేపర్ సెట్టింగ్ లోపంపై అధ్యాపకులు చర్చించి విద్యార్థులకు సూచనలు చేశారన్నారు. 40 మార్కులకు పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు.

పార్టీ పటిష్టతకు సమన్వయంతో పనిచేద్దాం



మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం. చిత్రంలో కె.వి.జి.సత్యనారాయణ తదితరులు

ఆమదాలవలస: వైఎస్సార్ సీపీ పటిష్టతకు కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం ఆమదాలవలస పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చటంలో వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు చేరువగా ఉండేందుకు కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. కార్యకర్తలు నాయకులు అన్ని విభాగాల ప్రతినిధులతో సమన్వయం ఏర్పరచుకొని పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. ప్రభుత్వంలోని వ్యతిరేకతను పార్టీకి అనుకూలంగా మార్చుకునేందుకు అందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, బి.రామారావు, పార్టీ ముఖ్య నాయకులు కిల్లి రామ్మోహన్ రావు, తమ్మినేని చిరంజీవినాగ్, పప్పల రమేష్, బోర గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, చలపతిరావు, పప్పల రమేష్, లోలుగు కాంతారావు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తమ్మినేని సీతారాం

ధాన్యం కొనుగోలుకు మోక్షమెప్పుడో?



బాలసీమ గ్రామంలో రైతుల ఇంటి వద్ద ధాన్యం

నరసన్నపేట: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వందల బస్తాలు ధాన్యం ఇంకా రైతుల వద్దే మూలుగుతున్నాయి. రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా వీఏఏలు కొనుగోలు చేయకపోవడం ఆందోళన చెందుతున్నారు. నరసన్నపేట మండలంలో ఇప్పటి వరకూ 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మరో వెయ్యి మెట్రిక్ టన్నుల వరకూ నిల్వలు ఉన్నాయి. వీటిని అమ్మేందుకు రైతులు ప్రయత్నిస్తున్నా ఫలితం ఉండటం లేదు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నేరుగా పౌరసరఫరాల మంత్రి మనోహర్‌ను కలిసినా అదనపు లక్ష్యం మంజూరు కాలేదు. దీంతో అధికారులు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే వరకూ కొనుగోలు చేయలేమని చేతులెత్తేశారు. కొనుగోలు కేంద్రాలు కూడా నెల రోజులుగా మూతపడి ఉన్నాయి. మాకివలస, దూకులపాడు, బాలసీమ, బసివలస, బాడాం, తెలగవలస, చిక్కాలవలస, నడగాం, లుకలాం, దేవాది, మడపాం, పోతయ్యవలస, గోపాలపెంట తదితర గ్రామాల్లో వందల బస్తాల ధాన్యం నిల్వలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ అధికారి కె.సునీత వద్ద ప్రస్తావించగా అదనపు లక్ష్యం రాలేదని, వస్తే తప్ప కొనుగోలు చేయలేమని స్పష్టం చేశారు.

సాంకేతికత ఆధారంగా కేసుల దర్యాప్తు



కొత్తూరు పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

కొత్తూరు : ఆధునిక సాంకేతికత ఆధారంగా కేసుల దర్యాప్తు ముమ్మరం చేయాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి చెప్పారు. కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించిన ఎస్పీ పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, మద్యం, నాటు సారాతో పాటు పలు రకాల మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెండింగ్ కేసుల దర్యాప్తు ముమ్మరం చేయాలన్నారు. సారా అమ్మకాలు, తయారీ జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో సంకల్పం అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో మాట్లాడారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ మూర్తి, సీఐ చింతాడ ప్రసాదరావు, కొత్తూరు, హిరమండలం ఎస్ఐలు ఎండీ అమీర్ అలీ, మహమ్మద్ యాషిన్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల్లో వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణలకు దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిఫ్రిజిరేటర్, ఏసీ మెకానిజంలో 30 రోజులు, సీసీ టీవీ ఇన్‌స్టలేషన్ 13 రోజుల పాటు పురుష అభ్యర్థులకు శిక్షణ ఉంటుందని, ఈ నెల 27 నుంచి బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అర్హులకు స్వయం ఉపాధి కల్పించేందుకు బ్యాంకు రుణం సైతం మంజూరు చేస్తామని తెలిపారు.

నేడు జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సీనియర్స్ మహిళలు, జూనియర్స్ బాలురు హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు శుక్రవారం జరగనున్నాయని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియం వేదికగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఎంపికైన జిల్లా జట్లను ఈ నెల 21 నుంచి 23 వరకు కర్నూలు జిల్లా జిల్లా డీఎస్ఏ క్రీడామైదానం వేదికగా జరగనున్న 10వ ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్‌జిల్లాల) హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జన న ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో హాజరుకావాలన్నారు.